భారతదేశపు పశ్చిమాసియా విధానపు పయనం ఎటువైపు?

సౌదీ అరేబియాతో పెరుగుతున్న భారతదేశ సంబంధాలు; ఇటీవల ప్రధాని తన సౌదీ అరేబియా పర్యటనకి ఇచ్చిన రాజకీయ ప్రాముఖ్యత; మరియు అక్కడ కుదుర్చుకున్న ఒప్పందాలను గమనిస్తే, భారతదేశపు పశ్చిమాసియా విధానం ఏమిటనే ప్రశ్న మరోసారి మన ముందుకొస్తుంది.

ఇజ్రాయిల్ దురాక్రమణను నిరసిస్తూ తమ మాతృభూమికోసం పోరాటం సాగిస్తున్న పాలస్తీనీయుల పక్షాన నిలచి, అభివృద్ధిచెందుతున్న పశ్చిమాసియా దేశాలలో తామూ ఒకదేశంగా భారత పాలకులు ప్రకటించుకున్న కాలం ఒకటి వుంది. అయితే ఆచరణలో ఈ ప్రకటనలన్నీ బూటకమైనవని, సామ్రాజ్యవాదుల జోక్యందారీ ఆధిపత్య విధానాలపట్ల మౌనంగా వుండటమో లేక మద్దతుదారుగా నిలవటమో భారతప్రభుత్వ విధానంగా స్పష్టమైంది.

సామ్రాజ్యవాద దేశాలకు లొంగుబాటుదారులు గానో లేక వారి కూటమిలో భాగస్తులుగానో పశ్చిమాసియా దేశాలలో కొన్ని వుండగా; సామ్రాజ్యవాద దేశాల దోపిడీ, జోక్యం, ఆధిపత్య విధానాలను ఏదో ఒక రూపంలో విబేధిస్తూ, వ్యతిరేకిస్తూన్న దేశాలు గానూ; సామ్రాజ్యవాద దేశాల ప్రత్యక్ష సైనికదాడులకు, దురాక్రమణలకు లోనైన దేశాలుగా మరికొన్ని వున్నాయి. ఈ దేశాలన్నింటితోనూ తాము సమ తూకంతో వ్యవహరిస్తున్నామని భారత పాలకులు ప్రకటించుకుంటున్నారు. కానీ అదే సందర్భంలో సామ్రాజ్యవాద అనుకూలురుగా వ్యవహరిస్తున్నారు.

1990లలో సోవియట్ యూనియన్ కూలి పోయిన తర్వాత సామ్రాజ్యవాదులు, మరీ ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు ప్రపంచంపై ఆధిపత్యం సాగించే సాధనంగా ప్రపంచీకరణగా చెప్పబడే విధానాన్ని ప్రవేశపెట్టారు. భారత పాలకులు వెను వెంటనే ఈ విధానాన్ని తమ భుజస్కంధాలపై మోయటానికి సంసిద్ధులైపోయారు. మనదేశంలో సామ్రాజ్యవాదులదోపిడీ, అదుపు మరింతగా అధికమైన కాలమిది. అత్యంత సహజంగా ఈ పరిణామాలు, భారత పాలకుల విదేశాంగ విధానంపై ప్రతిఫలించాయి.

ఒకనాడు పాలస్తీనీయుల న్యాయమైన కారణం పక్షాన నిలిచామని గొప్పగా చెప్పుకున్న భారత పాలకులు, 'సమతూకపు' వైఖరిననుసరిస్తున్నామని చెపుతూ ఇజ్రాయిలీ పాలకులతో మంచి సంబంధాలను పెంచుకుంటున్నారు. యుపిఏ పాలనాకాలంలో ఈ సంబంధాలు బలపడి, ఆర్థిక-సైనిక రంగాలకు విస్తరించగా, ప్రస్తుత మోడీ నాయకత్వంలోని బిజెపి పాలనలో ఈ సంబంధాలు మరింత వేగవంత మయ్యాయి. మొదటిసారిగా భారత ప్రధాని ఇజ్రాయిల్‌లో పర్యటించటం దీనిలో భాగమే.

అమెరికా సామ్రాజ్యవాదులు, 2001 సెప్టెంబర్ 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్(డబ్ల్యుటిసి)లోకి విమానం దూసుకెళ్ళిన ఘటనను సాకుగా ఉపయోగించుకొని, ఆఫ్ఘనిస్తాన్‌పై సైనికదాడి జరిపి దానిని దురాక్రమించారు. అమెరికా ప్రయోజనాలకు ఎవరు అడ్డునిలిచినా లేదా ఎవరు అడ్డు నిలిచినట్లుగా తాము భావించినా ప్రపంచంలోని ఏ దేశంపైనైనా దాడిచేసే హక్కు తమకు వుందని అమెరికా సామ్రాజ్యవాదులు ప్రకటించారు. దీనినే వారు 'ప్రపంచ ఉగ్రవాదంపై యుద్ధంగా' ప్రకటించి, దీనిలో తమతో కలిసి రావలసిందిగా ఇతర దేశాలను కోరారు. ఈ యుద్ధం ప్రధానంగా ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టారు. అమెరికా సామ్రాజ్యవాదుల యుద్ధ పిలుపుకు, మరియు వారు నగ్నంగా దురాక్రమణ యుద్ధాలు సాగించి, దేశాలను ఆక్రమించటానికి మద్దతుగా నిలిచేందుకు, భారత పాలకులేనాడూ సిగ్గుపడలేదు. జనహనన ఆయుధాలు కలిగివుందనే తప్పుడు సాకుతో అమెరికా సామ్రాజ్యవాదులు సైనిక దాడి సాగించి ఇరాక్‌ను దురాక్రమించారు. ఇరాక్ అధ్యక్షుడైన సద్దాం హుస్సేన్‌ను వారు చట్టవిరుద్ధంగా పట్టి, బంధించి క్రూరంగా హత్యగావించారు. అమెరికా సామ్రాజ్య వాదుల ఈ నీచమైన చర్యలను భారతప్రభుత్వం ఖండించలేదు. ఇరాన్ అణ్వాయుధాలను ఉత్పత్తి చేస్తుందనే ఆరోపణతో అమెరికా మరియు ఇతర సామ్రాజ్యవాద దేశాలు అన్యాయంగా ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు విధించినప్పుడు భారత పాలకులు ఆ ఆంక్షలను వినయపూర్వకంగా అమలుచేశారు. అమెరికా వత్తిడులకు తలొగ్గిన భారత పాలకులు ఇరాన్-పాకిస్తాన్- ఇండియా చమురు పైప్‌లైన్ పథకంనుండి వైదొలిగారు. ఈజిప్టు, ట్యునీసియా దేశాలలో అమెరికా సాగిస్తున్న జోక్యందారీ, ఆధిపత్య విధానాలను భారత పాలకులు ఏనాడూ ప్రశ్నించలేదు. ఆయా దేశాలలో టెర్రరిస్టు గ్రూపులను ఏర్పాటుచేసి, వాటిద్వారా ఆయాదేశాల ప్రభుత్వాలను అస్థిరత్వానికి గురిచేసి తిరిగి 'టెర్రరిస్టుల వ్యతిరేక పోరాటం' పేరుతో ఆయా దేశాలపై సాగిస్తున్న సైనిక చర్యలన్నీ-తమను వ్యతిరేకించే ప్రభుత్వాల స్థానంలో తమ అనుకూల ప్రభుత్వాలను ప్రతిష్టించే ఏకైక లక్ష్యంతో అమెరికా సామ్రాజ్యవాదులు చేస్తున్న ప్రయత్నాలే. వీటిని భారత పాలకులేనాడూ ఖండించలేదు. ఇవన్నీ, భారత పాలకుల పశ్చిమాసియా విధానం సామ్రాజ్యవాద దేశాల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు, ఆదేశాలకు లోబడి మాత్రమే వుంటుందని తేటతెల్లంచేస్తోంది.

ఇక్కడ మరో ముఖ్యమైన పరిణామాన్ని గమనించాలి. అమెరికా ఆధిపత్య వ్యూహంలో భారత పాలకులు భాగస్వాములయ్యారు. కాంగ్రెస్ హయాంలో ఇది ప్రారంభమై, అమెరికా నాయకత్వంలోని అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా కూటమిలో చేరటమనే ప్రమాదకర

స్థితికి చేరుకుంది. వివిధ రంగాలలో ఈ కూటమి యొక్క వ్యూహాత్మక కర్తవ్యాలను అమలుచేసేందుకు ప్రస్తుత బిజెపి పాలనాకాలంలో మరింత వేగంగా కదులుతున్నారు. అమెరికా సామ్రాజ్యవాదులతో తమ చర్యలను భారత పాలకులు సమన్వయం చేసుకుంటున్నారు.

పశ్చిమాసియాలోని అన్ని దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే, భారత పాలకులు సౌదీఅరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇజ్రాయిల్ వంటి దేశాలతో తమ సంబంధాలను పెంచుకునేందుకు ప్రత్యేక దృష్టితో కేంద్రీకరిస్తున్నారు. ఈ దేశాలన్నీ అమెరికా కూటమిలో దేశాలని ప్రత్యేకించి చెప్పనవసరంలేదు.

గత రెండు దశాబ్దాలకుపైగా భారత పాలకులు సౌదీఅరేబియాతో తమ ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తున్నారు. పశ్చిమాసియాతో సంబంధాలు నెరిపేందుకు మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ప్రత్యేకించి ఓ రాయబారిని ఏర్పరచింది. 2006లో కింగ్ అబ్దుల్లా- అబ్దుల్లారీఖ్జ్ భారత పర్యటన భారత-సౌదీఅరేబియా సంబంధాలకు ఊపునిచ్చింది. గత 30 సం॥ల కాలంలో 2010లో భారత ప్రధాని సౌదీఅరేబియాను సందర్శించాడు. ఈ సందర్భంగా ఇరుదేశాల ప్రధానులూ రక్షణ, యుద్ధ, ఆర్థికరంగాలలో సహకారాన్ని విస్తృతపరుచుకునే చట్రపరిధిలో 'రియాద్ ప్రకటన'పై సంతకాలు చేశారు. భారత - సౌదీఅరేబియాల నడుమ అప్పటినుండి భద్రతాసహకారం, నిఘా వ్యవస్థల ఏర్పాటు, తోడ్పాటుల్లో గుర్తించదగిన పురోగతి వుంది.

2011 సెప్టెంబర్ 11, డబ్ల్యుటిసి ఘటన తర్వాత ఉగ్రవాద వ్యతిరేక సహకారం పేరుతో భారత పాలకులు సున్నీ ముస్లిమ్ దేశాలతో మరింతగా రక్షణ ఒప్పందాలను పెంచుకున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీఅరేబియా దేశాల పర్యటనలలో ప్రధాని మోడీ ఉగ్రవాద వ్యతిరేక అంశంపైనే ప్రధానంగా కేంద్రీకరించాడు.

మోడీ, సౌదీఅరేబియా పర్యటన సందర్భంగా ఇరుదేశాల అధినేతలూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయటంలో సహకరించుకుంటామని ప్రకటన చేశారు. ఇది-ప్రపంచ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అమెరికా చెబుతున్న పోరాటంతో భారతదేశం చేతులు కలపటమే! ఉగ్రవాదుల మూలవిరాట్టు అమెరికా సామ్రాజ్యవాదులన్న సంగతి యావత్ ప్రపంచాని కంతటికీ తెలిసిన విషయమే. సిరియాతోసహా అనేక పశ్చిమాసియా దేశాలలో అసంఖ్యాక ఉగ్రవాద బృందాలను వారు పెంచి పోషించి, తమ ఆధిపత్య లక్ష్యాన్ని వాస్తవం చేయబూనుకుంటున్నారు. ఆల్-ఖైదా, తాలిబన్లు, ఐఎస్ఐఎస్‌లన్నీ అమెరికా సామ్రాజ్యవాదుల సృష్టే. ఈ ఉగ్రవాద బృందాలతో, ఆయా దేశాలలో అరాచకం సృష్టించి, దేశాన్ని అస్థిరపరిచి, ఆపై ఆదేశాలను కాపాడేసాకుతో సైనిక చర్యలకు పాల్పడటం అనేవి సామ్రాజ్యవాదుల విధానంయొక్క రెండు ముఖాలుగా వున్నాయి. పశ్చిమాసియాలో అమెరికా కూటమిలో భాగంగా వున్న సౌదీఅరేబియా పాలకులు, వహబ్బీ ఇస్లామిక్ బృందాలను ప్రపంచవ్యాపితంగా పెంచుతోంది. పశ్చిమాసియాతోసహా, ప్రపంచంలోని పలు దేశాల నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న అనేక ఉగ్రవాద బృందాలు ఇస్లామ్‌లోని వహబ్బీశాఖతో ప్రేరణ పొందినవే. అమెరికా సామ్రాజ్యవాదుల వ్యూహాత్మక పథకాలకు సహకరించేవిధంగా సౌదీఅరేబియా పాలకులు తమ కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నారు. సిరియాలో సౌదీఅరేబియా ఉగ్రవాద గ్రూపులు క్రియాశీలంగా వున్నాయనే విషయం అందరికీ తెలిసిందే. షియా తిరుగుబాటుదారులకు దన్నుగా నిలచి ఇరాన్‌కు వ్యతిరేకంగా పోరాటం పేరుతో గత సం॥ర కాలంగా యెమన్‌పై సౌదీఅరేబియా బాంబుదాడులు సాగిస్తోంది. ఈ దాడులు ఘోరమైన మానవత్వపు విపత్తుగా పరిణమించి యెమన్‌లో లక్షలాదిమంది ప్రజలను నిరసనలు తెలియచేస్తూ వీధుల్లోకి తెచ్చింది. కనుక, సౌదీఅరేబియా పాలకులతో చేతులు కలిపిన భారత పాలకులు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏవిధమైన పోరాటం సాగిస్తారో స్పష్టమౌతోంది.

పశ్చిమాసియాలో పనిచేస్తున్న 1 కోటీ 10 లక్షల మంది భారతదేశ కార్మికులలో 30 లక్షలమంది సౌదీ అరేబియాలోనే వున్నారు. వీరంతా విదేశీ మారకద్రవ్యం సమకూర్చటంలో మనదేశానికి పెద్దవనరుగా వున్నారు. ఈ వనరులను జాగ్రత్తగా కాపాడుకోవాలనే కోరిక, బహుశ భారత పాలకులు సౌదీఅరేబియా పట్ల చూపుతున్న ప్రత్యేక ఆసక్తికి కారణమైవుండవచ్చని కొంతమంది పరిశీలకుల భావన. కానీ, చమురు ధరలు తీవ్రంగా పడిపోవటం, అమ్మకాలు పడిపోవటం కారణంగా సౌదీఅరేబియా ఈనాడు ఒక తీవ్రమైన ఆర్థిక సంక్షోభంగుండా పయనిస్తోంది. 2015 ఆర్థిక సంవత్సరంలో సౌదీఅరేబియా 100 బిలియన్ డాలర్ల తీవ్రమైన బడ్జెట్ లోటులో వుంది. ఈ కారణంగా ప్రభుత్వం అనేక ఖర్చులలో కోత విధించింది. దేశంలో 11.5 శాతం నిరుద్యోగం కొనసాగుతోంది. ఇది రానున్న కాలంలో మరింత పెరగనుంది. 2014లో 3 కోట్ల 80 లక్షల జనాభావున్న దేశంలో విదేశీ కార్మికులు, పనివారు 10.1 మిలియన్లుగా వున్నారు. ఇది దేశ జనాభాలో షుమారు మూడోవంతుగా వుంది. తీవ్ర ఆర్థికసంక్షోభ సమయంలో, నిరుద్యోగ సమస్య, పరిశ్రమలను లాకౌట్, లేఆఫ్‌లకు గురిచేసి విదేశీ కార్మికులను ప్రధానంగా తొలగించే చర్యలను తీవ్రం చేసే అవకాశం అధికంగా వుంది. నిర్మాణరంగంలో పనిచేస్తున్న 45శాతం మంది కార్మికులు నేడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే విదేశీ కార్మికులనేకమంది ఈ ప్రభావానికి లోనై పనులు కోల్పోయారు. ట్యాక్సీలు, పర్యాటకం, రియల్‌ఎస్టేట్ రంగం, నగలు, ఆభరణాలు, కూరగాయల మార్కెట్ల వంటి వాటన్నింటినీ ప్రభుత్వం క్రమంగా జాతీయం చేసేందుకు పథకాలను సిద్ధంచేస్తోంది. వీటిద్వారా 1 కోటీ 30 లక్షలమంది సౌదీఅరేబియా దేశస్థులకు ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని భావిస్తోంది. మొబైల్ సెల్‌ఫోన్ల అమ్మకాలను నిషేధించాలని యోచిస్తోంది. ఈ క్రమం అమలుకావటం ప్రారంభమైతే విదేశీ కార్మికులకు ఉద్యోగావకాశాలు మూసుకుపోవటమే గాక, ఇప్పటికే పనిచేస్తున్న విదేశీ కార్మికులు, పనివారు దేశాన్ని వదలి

వెళ్ళవలసిరావటమో లేదా మరింత తక్కువ వేతనంతో, కఠినతరమైన ఉద్యోగాలు, పనులు చేయటానికి సిద్ధపడటమో తేల్చుకోవలసివస్తుంది. భారతప్రభుత్వం సౌదీఅరేబియానుండి తిరిగివచ్చే కార్మికులకు ఉద్యోగాలు కల్పించగలిగిన పరిస్థితిలోనూ లేదు; భారతదేశ కార్మికులకు తగిన ఉద్యోగభద్రత, వేతనాలు, సరైన పనిపరిస్థితుల నడుమ ఉద్యోగాలు కొనసాగింపజేసే విధంగా సౌదీ ప్రభుత్వంనుండి నిర్దిష్టహామీలను పొందగల స్థితిలోనూ లేదు.

అయితే, వాస్తవానికి సమస్య ఏమంటే– ప్రపంచాధిపత్యంకోసం సామ్రాజ్యవాదులు ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల వ్యూహానికి లోబడి, వారి ప్రయోజనాలకు తోడ్పడేవిధంగా ఇతర దేశాలతో తన సంబంధాలను ఏవిధంగా కొనసాగించాలి లేదా అభివృద్ధిచేసుకోవాలి అనేది భారత ప్రభుత్వంముందున్న ప్రధాన అంశంగా వుంది. ఒక్కసారి ఈ విధానపు చట్రంలో భారత పాలకులు తమను తాము బిగించుకున్న తర్వాత మనదేశ, ప్రజల ప్రయోజనాల గురించి ఆలోచించే అవకాశమే వుండదు. భారత ప్రభుత్వ పశ్చిమాసియా విధానం, భారతదేశాన్ని– సామ్రాజ్యవాద వ్యతిరేక, ఆధిపత్య వ్యతిరేక శాంతికాముక, ప్రజాస్వామికశక్తులనుండి, ప్రజలనుండి అనివార్యంగా దూరంచేస్తుంది. ఇలాంటి పరిణామాలను మనదేశ ప్రజలు హర్షించరు. ఇజ్రాయిలీ దురహంకారానికి వ్యతిరేకంగా పాలస్తీయులు తమ మాతృభూమికోసం చేసే పోరాటానికి భారతప్రజలు ఎల్లవేళలా తమ మద్దతును తెలియజేస్తారు; వారి పక్షానే నిలుస్తారు. అలాగే పశ్చిమాసియా ప్రజానీకం – సామ్రాజ్య వాదానికి, వారి జోక్యందారీ విధానాలకు, ఆధిపత్య, యుద్ధవిధానాలకు వ్యతిరేకంగా చేసే పోరాటాలకు దన్నుగా నిలుస్తారు.

ooooo